సాక్షి బాపట్ల

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు

నగరం: శ్రావణ శనివారం పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసునికి విశేష పూజలు చేశారు.



వెండి వస్తువులు వితరణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి హైదరాబాద్‌కి చెందిన మల్లంపల్లి రాజశేఖరరావు, విశాలక్ష్మి దంపతులు వెండి వస్తువులను కమిటీ సభ్యులు నరేష్‌కి అందించారు.



శనీశ్వరుడికి పూజలు

మంగళగిరి: పట్టణంలోని శివాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో శనీశ్వరుడికి భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు



బాపట్ల: మహిళ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీకి పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించామని జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ప్రత్యేక దత్తత ఏజెన్సీ కింద ఎనిమిది ఉద్యోగాలకు, వన్‌స్టాప్ సెంటర్ (సఖి) కింద ఏడు ఉద్యోగాలకు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు జరిగాయి. జిల్లాస్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు ప్రత్యేక దత్తత ఏజెన్సీ కింద మొత్తం 104 దరఖాస్తులు రాగా, 90 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరగా, 14 మంది గైర్హాజర య్యారన్నారు. వన్ స్టాప్ సెంటర్ (సఖి) కింద మొత్తం 69 దరఖాస్తులు రాగా, 57 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, 12 మంది గైర్హాజరు అయ్యారన్నారు. అదనపు ఎస్పీ విశలేశ్వరరావు, మహిళా సంక్షేమశాఖ పీడీ కె.ఉమా, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజా దిబోరా, గుంటూరు సీడబ్ల్యూసీ చైర్మన్, ఒంగోలు సీడబ్ల్యూసీ సభ్యుడు, జేజేబీ చైర్మన్, పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు రేపల్లె విద్యార్థి



రేపల్లె రూరల్: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రేపల్లెకు చెందిన బొలిశెట్టి ప్రేమ్‌సాయి ఎంపికయ్యాడు. పట్టణంలోని శ్రీపొట్టి శ్రీరాములు ప్రాథమిక పాఠశాలలో 3వతరగతి చదువుతున్న ప్రేమ్‌సాయి బోధిధర్మ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతూ జూలై 19, 20 తేదీలలో రేపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ కనపరచి బంగారు పతాకాన్ని సాధించాడు. ఆగస్టు 18వ తేదీన ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగశైలజ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బొలిశెట్టి శశి భూషణరావు, ఉపాధ్యాయులు క్రీడాకారుడుకు అభినందనలు తెలిపారు.

నేడు తెనాలిలో జిల్లా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

తెనాలి: గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఆదివారం గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2024 తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ దగ్గర్లోని క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహకురాలు, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ ఘట్టమనేని సాయి రేవతి ఒక ప్రకటనలో తెలియజేశారు.

సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ వద్ద శనివారం రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. రెండు క్రస్ట్‌గేట్లు 8 అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉండగా.. ఇది 312.0450 టీఎంసీలకు సమానం. సాగర్ నుంచి కుడి కాలువకు 8,298, ఎడమ కాలువకు 8,022, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 29,354, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 72,994 క్యూసెక్కులు వచ్చి చేరుతుండటంతో అంతే మోతాదులో సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్నారు.

రాయే.. ఊతమాయే

వృథా రాళ్లను హద్దు రాళ్లుగా మలుస్తూ బతుకు పయనం

టిక్..టిక్..టిక్ మంటూ ఆ ప్రాంతంలో వినిపించే శబ్దం.. జీవన సౌందర్య శ్రావ్య సునాదం. కఠిన రాయిని ఒడుపుగా చీల్చితేనే కడుపునిండేది. వాటిని హద్దురాయిగా మలిస్తేనే పళ్లెంలో ముద్ద పడేది. నాలుగు రాళ్లు వెనకేసుకోవాలన్నది పెద్దల సలహా అయితే.. రాళ్లు ముందేసుకుని వాటిలోనే జీవనోపాధిని వెతుక్కోవడం వారికి తెలిసిన విద్య. ఒక్కోసారి గురితప్పి చేతిపై పడే సుత్తి దెబ్బలు.. రాళ్లే మీద పడి కాళ్లు పోయిన సందర్భాలు.. సుత్తి దెబ్బలకు చేతులు అదురుతున్నా.. ఉలి ఒక్కోసారి గాల్లో ఎగిరి దేహానికి గాయమవుతున్నా.. అదరక, బెదరక వారు చేసే జీవన పోరాటం అచ్చెరువొందిస్తుంది. గ్రానైట్ పరిశ్రమల్లో వృథాగా మిగిలే రాయి నుంచి హద్దురాళ్లను తయారు చేస్తూ బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు మండలాల్లో వందలాది మంది ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

హద్దురాళ్ల పనుల్లో మహిళా కార్మికులు



- బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు మండలాల్లో ఉపాధిగా మారిన హద్దురాళ్ల తయారీ
- సంవత్సరం పొడవునా ఎగుమతులు
- తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడుకు లారీల ద్వారా సరఫరా
- వేలాదిమంది కార్మికులకు జీవనోపాధి



హద్దురాళ్ల తయారీలో దివ్యాంగుడు షేక్ హుస్సేన్ దంపతులు

బల్లికురవ: మండల కేంద్రం బల్లికురవ సమీపంలోని ఈర్ల కొండ నుంచి తీసే స్టీల్ గ్రే గ్రానైట్‌కు దేశ విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఇక్కడ తీసే గ్రానైట్ ముడిరాళ్లు పరిశ్రమలకు నిత్యం ఎగుమతి అవుతుంటాయి. బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లోని సుమారు 1600 గ్రానైట్ పరిశ్రమలకు ముడిరాళ్ల ఎగుమతి నిత్యం జరుగుతోంది. ఈ పరిశ్రమల్లో ముడి రాయిని పరుపురాళ్లుగా తయారు చేస్తారు. పరుపురాయి తీసే దశలో వచ్చే వృథారాయితో హద్దు రాళ్లుగా తయారు చేస్తూ పలువురు జీవనోపాధి పొందుతున్నారు.

1200 మందికి ఉపాధి

బల్లికురవ, వల్లాపల్లి, నాగరాజు పల్లి, మార్టూరు, వేమవరం జంక్షన్, జొంతాళి, రాజుపాలెం, ఏల్చూరు, సంతమాగులూరు, వెల్లల చెరువు, మల్లాయపాలెం, కొణిదెన, నక్కబొక్కలపాడు, కామేపల్లి, రాజుగారి పాలెం వద్ద గ్రానైట్ పరిశ్రమల పొలాలు, స్థలాలకు హద్దు (ఫెన్సింగ్‌తో) రాళ్లు, ఇళ్లు, పరిశ్రమల నిర్మాణంలో ఫౌండేషన్‌లో వాడే సైజు రాళ్లు, వేస్టు చెక్కను తయారు చేస్తూ సుమారు 1200 మంది వరకు పురుషులు, స్త్రీలు, ఉపాధి పొందుతున్నారు.

ఒక్కో కార్మికుడు 7 అడుగుల రాయి చీల్చి తీసినందుకు రూ. 80 తీసుకుంటారు. 6 అడుగుల రాయి తీసినందుకు రూ. 70 వంతున తీసుకుంటారు.

హద్దురాళ్లు చేస్తూ జీవిస్తున్నాం



గ్రానైట్ వృథా రాళ్ల నుంచి హద్దురాళ్లు తీస్తూ 10 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నాను. ప్రమాదంలో ఎడమకాలు మోకాలి పైవరకు పూర్తిగా కట్ అయింది. నా భార్య సహాయంతో చెక్కకాలు వేసుకుని పని ప్రదేశానికి వచ్చి ఇద్దరం కలిసి పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాం.

– షేక్ హుస్సేన్, దివ్యాంగుడు, వల్లాపల్లి

అలవాటు పడ్డాం...



వృథారాయి చెక్కల నుంచి హద్దు రాళ్లు తీసే పనికి అలవాటు పడ్డాం. గతంలో కొండల్లో మెటల్ తీసేవాళ్లం. స్టోన్ క్రషర్లు వచ్చాక మేం తయారు చేసే మెటల్‌కు గిరాకీ తగ్గింది. దీంతో 10 సంవత్సరాలుగా హద్దు సైజు రాళ్లు తీస్తూ రోజుకు రూ.700 నుంచి రూ. 800 సంపాదిస్తున్నా.

– షేక్ షరీఫ్, వల్లాపల్లి

లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఎగుమతులు...

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, తమిళనాడు, కర్ణాటకకు ఆర్డర్లపై నిత్యం లారీల ద్వారా హద్దురాళ్లను ఇక్కడ నుంచి లోడింగ్ చేసి పంపుతున్నారు. సమీపంలోని అద్దంకి, దర్శి, శావల్యాపురం, వినుకొండ, పర్చూరు, కొరిశపాడు మండలాలకు ట్రాక్టర్‌లకు లోడ్‌చేసి కాంట్రాక్టర్లు పంపుతుంటారు. జూన్ నుంచి నవంబర్ వరకు వ్యవసాయ పనుల వల్ల కొంత మేర డిమాండ్ తగ్గుతోందని కాంట్రాక్టర్లు షేక్ అబ్దుల్లా, అల్లావుద్దీన్ 'సాక్షి'కి తెలిపారు. పై రాష్ట్రాల్లో గత 10 సంవత్సరాలుగా హద్దు రాళ్లకు గిరాకీ ఉండటంతో ప్రధాన గ్రామాల్లో, పట్టణాల్లో అక్కడి వ్యాపారులకు ఆర్డర్ల ప్రకారం పంపుతున్నట్లు వివరించారు. వృథా రాయి నుంచి హద్దురాళ్లు తయారు చేస్తూ వేల మంది ఉపాధి పొందుతున్నా.. మైనింగ్ అధికారులు తనిఖీల పేరిట ఇబ్బందులు పెట్టడం మానడం లేదని పలువురు వాపోతున్నారు.



ట్రాక్టర్‌పై తరలిస్తున్న హద్దురాళ్లు

విజన్ బాపట్లపై సమగ్ర ప్రణాళిక

జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు



బాపట్ల: విజన్ బాపట్లపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. వికసిత్ ఆంధ్ర కార్యక్రమంపై అన్నిశాఖల జిల్లా అధికారులకు ఒకరోజు వర్క్‌షాప్ శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ప్రజల తలసరి ఆదాయం పెరిగేలా సహజ వనరుల సద్వినియోగంపై అధికారులు దృష్టి సారించాలని జేసీ సూచించారు. అభివృద్ధి పెరుగుదల ఉండాలని, లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా భవిష్యత్తులో ఉత్పత్తి రంగాల ఉత్పాదకత ఉండేలా చూడాలన్నారు. ఇందుకోసం విజన్ బాపట్ల ఉండాలని వివరించారు. డెవలప్ ఇండియా మిషన్ లక్ష్యంతో కేంద్రం ముందుకు వెళ్తుందన్నారు. 2030 నాటికి సుస్థిరాభివృద్ధి, 2047వ సంవత్సరానికి జీడీపీ పెరుగుదలతో భారత మూడో స్థానానికి చేరడమే లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా ఆదాయ వృద్ధి రూ.36,577 కోట్లు ఉందన్నారు. జిల్లా వ్యవసాయ రంగంలో ఆదాయం 56.09 శాతం కాగా, పరిశ్రమల ఆదాయ 16.10శాతం, ఉండగా సర్వీస్ సెక్టార్లలో ఆదాయం 27.81 శాతం ఉందన్నారు. మొత్తంగా బాపట్ల జిల్లా అభివృద్ధి రేటు 7.59శాతంగా ఉండగా, రాష్ట్రంలో జిల్లా ఉత్పత్తి ఆదాయం 2.81శాతంగా ఉందన్నారు. సంవత్సరంలో వృద్ధిరేటు 15శాతానికి చేరుకోవాలన్నారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య, వైద్యం, తాగునీరు, వసతుల కల్పనతోనే ఆదాయ వనరులు వేగంగా పెరుగుతాయని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన నిరసనలు.. నిలిచిన వైద్యసేవలు



పాతబస్టాండ్ వద్ద మానవహారం చేపట్టిన వైద్యులు, వైద్య సిబ్బంది

కోల్‌కతలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా బాపట్లలో ర్యాలీ, మానవహారం

బాపట్ల: కోల్‌కతలో ట్రైనీ వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం వైద్యులు బాపట్లలో నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక ఏరియా వైద్యశాల నుంచి సాగిన నిరసన పట్టణ ప్రధాన వీధుల వెంబడి కొనసాగింది. అనంతరం స్థానిక పాతబస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. ఐఎంఏ బాపట్ల అధ్యక్షుడు డాక్టరు హక్ మాట్లాడుతూ నిర్భయ లాంటి సంఘటన మళ్లీ దేశంలో జరగటం బాధకరమైన విషయమన్నారు. దేశంలో ఎన్ని చట్టాలు చేసిన అవి కిందిస్థాయిలో కార్యరూపం దాల్చటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ వైద్యులకు, వైద్యసిబ్బంది ఆస్పత్రులలో రక్షణలేకుండా పోతుందన్నారు. వైద్యులు నిద్రాహారాలు లేకుండా సేవలు అందిస్తునప్పటికీ వారిపై దాడులు జరుగుతుండడం సరికాదన్నారు. వైద్యురాలిపై హత్యాచారం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలో వైద్యులు సునీల్, విజయలక్ష్మి, మీనా, మధు, విద్యాసాగర్, చల్లా రామోహనరావు, కె.వి.మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో చోరీలకు పాల్పడే ముఠా అరెస్ట్

- రూ. 17 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: దేవాలయాల్లో చోరీలకు పాల్పడి దేవుడి నగలు, హుండీల్లోని సొమ్మును స్వాహా చేసే దొంగల ముఠాను బాపట్ల పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 17 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు. వివరాలను శనివారం వెదుళ్ళపల్లి సమీపంలోని సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తుషార్‌డూడీ విలేకరులకు వెల్లడించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు దేవాలయాలు, చర్చిల్లోని హుండీలు, ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ తుషార్‌డూడీ ఈ కేసుల ఛేదనకు సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌కు అప్పగించారు. సీసీఎస్ సీఐ పి.ప్రేమయ్య, చుండూరు సీఐ సీహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు, ఐటీకోర్ ఎస్ఐ నాయబ్‌రసూల్ పర్యవేక్షణలో సీసీ కెమెరాల సహాయంతో శనివారం సాయంత్రం చుండూరు మండలం, ఆలపాడు బ్రిడ్జి సమీపంలో నిందితులైన గుంటూరుజిల్లా, తెనాలిలోని ఇస్లాంపేటకు చెందిన కారంపూడి విజయ్ కుమార్, తెనాలి బీసీ కాలనీకి చెందిన తాడిపత్రి సాయి, చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన బండికట్ల పవన్ కల్యాణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరు ముగ్గురు ముఠాగా ఏర్పడి ఊరికి దూరంగా ఉండే దేవాలయాలను ఎంచుకుని చోరీలకు పాల్పడటం, పార్కింగ్‌లో నిలుపుదల చేసిన బైక్‌లను దొంగిలించడం చేస్తూ ఉండేవారని తెలిపారు. నిందితుల నుంచి రూ. 6.10 లక్షల విలువైన 6.7 కిలోల వెండి, రూ. 10.55 లక్షల విలువైన 10 ద్విచక్రవాహనాలు, రూ. 35 వేల విలువైన ఎల్ఈడీ స్మార్ట్ టీవీలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు



ద్విచక్రవాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

కొడవళ్ల ఊరు.. పేటేరు

కొడవళ్లకు ప్రసిద్ధి పేటేరు శ్రామిక కాలనీ

- తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాలకు ఎగుమతి
- వ్యవసాయ సీజన్‌లో పేటేరు వైపు రైతుల అడుగులు
- మూడుతరాలుగా వృత్తిలో కొనసాగుతున్న పలు కుటుంబాలు
- పెరుగుతున్న ముడి సరుకు ధరలతో గిట్టుబాటు కాని శ్రమ
- వరికోత యంత్రాలతో తగ్గిన గిరాకీ



సిద్ధమైన కొడవళ్లు

రేపల్లె రూరల్: కణకణలాడే అగ్ని కీలల నుంచి ఎగసిపడే అగ్గి రవ్వలు.. లయబద్ధమైన సుత్తుల సవ్వడులు... బలంగా పిడికెళ్లు బిగించి మలాటులతో కార్మికులు తన శక్తిని ఉపయోగించే ధ్వనులు అక్కడ సర్వ సాధారణం. ముఖ్యంగా వ్యవసాయ సీజన్‌లో కర్షకుడికి ఉపయోగపడే సాధనమైన కొడవలి తయారీలో రాత్రింబగళ్లు శ్రమిస్తుంటుంది పేటేరు గ్రామం.

పేటేరు వైపే అడుగులు..

వ్యవసాయ సీజన్ ప్రారంభమైందంటే బాపట్ల జిల్లా రేపల్లె మండలంలోని పేటేరు గ్రామంవైపు రైతుల అడుగులు పడతాయి. వ్యవసాయ రంగంలో కోతలకు అవసరమైన కొడవళ్ల తయారీలో పేటేరు గ్రామంలోని శ్రామికనగర్ ప్రధాన భూమిక పోషిస్తోంది. వరి, మినుము కోతలకు అవసరమైన కొడవళ్ల తయారీలో పేటేరు గ్రామానికి రాష్ట్రంలోనే మంచి పేరు ఉంది. ఈ గ్రామం కొడవళ్ల తయారీలో ప్రధానపాత్ర పోషిస్తోంది. పేటేరులో సుమారు 70 ఏళ్ల క్రితం కొడవళ్ల తయారు ప్రారంభమై దినదినాభివృద్ధి చెందుతూ నేడు మూడవ తరం కార్మికులు వీటి తయారీలో నిమగ్నమయ్యారు. గ్రామంలో కొడవళ్ల తయారీ చేయడంలో నైపుణ్యత సాధించిన కార్మికులు నివసించే ప్రాంతం శ్రామికనగర్‌గా గుర్తింపు పొందింది. పేటేరు గ్రామంలో 30కి పైగా కార్ఖాణాలు(కొలిమి)లలో సుమారు 150 మందికిపైగా కార్మికులు పని చేస్తున్నారు.

కొలిమిలో కాలి పదునైన కొడవలిగా మారి..

ముడి ఇనుపబద్దలను కొలిమిలో కాల్చి కొడవలి ఆకృతిగా మలచిన అనంతరం దానికి సానపట్టి నొక్కులు కొట్టి చెక్కపిడులను అమర్చే ప్రక్రియలో శ్రామికులు నిరంతరం శ్రమిస్తుంటారు. ఒక్కో కొలిమిలో రోజుకు సుమారుగా 200 వరకు కొడవళ్లు తయారు చేస్తుంటారు. కొడవళ్లు మూడు రకాల ధరల్లో తయారవుతుంటాయి. రూ.40, రూ.60, రూ.80, 120ల ధరల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ తయారు చేస్తారు. ప్రతి నెల గ్రామంలో లక్షకుపైగా కొడవళ్ల తయారీ జరుగుతుంది.

కోత యంత్రాల రాకతో తగ్గిన గిరాకీ..

నూతన సాంకేతిక రంగంలో విప్లవాత్మకంగా వస్తున్న మార్పులతో రైతులకు అందుబాటులోకి వస్తున్న యంత్రాలు కొంత మేర కొడవళ్ల తయారీపై ప్రభావం చూపింది. గతంలో పోల్చితే కొడవళ్ల తయారీకి కొంతమేర డిమాండ్ తగ్గిందని కార్మికులు చెబుతున్నారు. తమ కార్ఖానాలలో సంవత్సరం మొత్తం కొడవళ్లు తయారు చేస్తున్నా వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నాలుగు నెలలు పని ఒత్తిడి అధికంగా ఉంటుదని పేర్కొంటున్నారు.

చెన్నై, వైజాగ్‌ల నుంచి ముడిసరుకు దిగుమతి..

కొడవళ్ల తయారీకి ఉపయోగించే బేల్ బద్దలను చెన్నై, విశాఖపట్నం, కాకినాడ పోర్టుల నుంచే కాకుండా విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసి దిగుమతి చేసుకుంటారు. ఏటికేడు ముడి సరుకు ధరలు పెరుగుతున్నా కొడవళ్ల ధరలు పెరగకపోవటంతో శ్రమ వృథా అవుతోందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. బేల్‌బద్దల లోడు గత ఏడాది రూ.58వేల నుంచి రూ.60వేలు ఉండగా ఈ సంవత్సరం రూ.65వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బొగ్గులు, చెక్క, ముడిసరుకులతో పాటు రవాణా చార్జీలు రోజురోజుకు పెరుగుతున్నా వాటి భారం కొడవలి ధర్లపై మోపకపోవడం గమనార్హం.

ఇతర రాష్ట్రాలకూ సరఫరా..

పేటేరులో తయారైన కొడవళ్లు తెలుగు రాష్ట్రాల నలుమూలలకు సరఫరా అవుతున్నాయి. అంతేకాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలకు పేటేరు కొడవళ్లు సరఫరా అవుతున్నాయి. అక్కడి నుంచి సైతం రైతులు వచ్చి కొనుగోలు చేస్తుండడం విశేషం.

కొడవలిపై 'పిడి'గుపాటు

కొడవళ్లు తయారైన తరువాత వీటికి అమర్చేందుకు చెక్కతో చేసిన పిడులు ఉపయోగించటం తప్పనిసరి. అయితే గ్రామంలోనే గతంలో పిడులు తయారు చేసేందుకు ప్రత్యేకంగా కొంతమంది కార్మికులు ఉండేవారు. వేరే ఉపాధి అవకాశాలు రావటంతో కొంతమంది.. శ్రమకు తగిన ఫలితం రాకపోవటంతో మరి కొంతమంది ఈ వృత్తికి దూరంగా ఉండటంతో పిడులు తయారు చేసేవారు గ్రామంలో కనుమరుగయ్యారు. దీంతో పిడులను ప్రస్తుతం జైపూర్ నుంచి అధిక ధరలు వెచ్చించి తెప్పించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



జైపూర్ నుంచి దిగుమతి చేసుకున్న పిడులు

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాం..



వందల మంది కార్మికులు కొడవళ్ల తయారీలో నిరంతరం శ్రమిస్తుంటారు. కత్తుల తయారీలో నాణ్యమైన ముడి ఇనుమును ఉపయోగించటంతో పాటు ప్రమాణాలను పాటిస్తూ కొడవళ్ల తయారీ జరుగుతుంది. దీంతో రైతులకు అందించే కొడవలి నాణ్యంగా ఉండటంతో ఎక్కువ కాలం ఉపయోగపడతాయి. దీంతో పేటేరు కొడవళ్లకు మంచి పేరు ఉంది.

– నలకుర్తి సుబ్బారావు, పేటేరు

సబ్సిడీ రుణాలు అందించాలి..



గతంతో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితులు ఎంతగానో మారిపోయాయి. నాటి ముడి సరుకుల ధరలకు నేటి ముడి సరుకుల ధరలకు ఎంతో వ్యత్యాసం ఉంది. మేము చేసే కొడవళ్లకు గిరాకీ ఉన్నా ధరలు పలకటంలేదు. ప్రభుత్వం మాపై దృష్టిసారించి కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలి. సబ్సిడీ రుణాలు అందించటంతో పాటు ముడి వస్తువులను సబ్సిడీకి అందించాలి.

– చందోలు ధనుంజయరావు, పేటేరు

క్లుప్తంగా

నేడు స్విమ్మర్ల జిల్లా జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా సీనియర్ బాల బాలికల స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై.వి. సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25వ తేదీన జరగనున్న 10వ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పోటీలో పాల్గొనే స్విమ్మర్లు తమ ఆధార్, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే ముందుగా తప్పనిసరిగా స్విమ్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

గుంటూరు, ప్రకాశం మ్యాచ్ ప్రారంభం



సిద్ధూ, గుంటూరు



డి.అభిలాష్, ప్రకాశం జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ పోటీలలో భాగంగా శనివారం గుంటూరు, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జట్టు తొలిరోజు మొదటి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని డి.అభిలాష్ 72, కె.ఆనంద్ 55, ఎస్.అఖిల్ 52 పరుగులతో అర్ధ సెంచరీలు సాధించారు. గుంటూరు బౌలర్ సిద్ధూ పొదుపుగా బౌలింగ్ చేసి 19.5 ఓవర్లలో 31 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టపోయి తొమ్మిది పరుగులు చేసింది. ఆదివారం రెండో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

కౌలు రైతు ఆత్మహత్య

గురజాల: అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. వివరాల ప్రకారం... తేలుకుట్ల గ్రామానికి చెందిన గుండాల ఆంజనేయులు (24) 6.5 ఎకరాలు కౌలుకు తీసుకుని గతేడాది పత్తి, మిరప పంటలు సాగు చేశారు. పంట పూర్తిగా దెబ్బతినడంతో పెట్టుబడి కింద తెచ్చిన రూ.9 లక్షల అప్పు మిగిలింది. దీంతో అప్పు ఎలా తీర్చాలనే ఆలోచనతో కొద్ది రోజుల నుంచి మనోవేదన గురవుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఇంటి సమీపంలోని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఆంజనేయులును బయటకు తీసి గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రం తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

క్రమశిక్షణకు క్రీడలు మారుపేరు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల ప్రారంభంలో మున్సిపల్ చైర్మన్ జంజనం

చీరాల రూరల్: క్రమశిక్షణకు మారుపేరుగా క్రీడలు నిలుస్తాయని.. చిన్ననాటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పేర్కొన్నారు. చీరాల ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. ప్రస్తుత యువత చదువుతో పాటు క్రీడలనూ సమానంగా చూడాలన్నారు. క్రీడలలో రాణించినవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో మంచి ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. క్రీడా పోటీల నిర్వాహకుడు గొట్టిపాటి భాగ్యరాజు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలు రెండు రోజులు పాటు కొనసాగుతున్నట్లు చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి 8 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నామని మొదటి బహుమతిగా రూ. 10,116, రెండో బహుమతిగా రూ. 7,116, మూడో బహుమతిగా రూ. 5,116 అందించనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, గొట్టిపాటి ఎబినేజర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పశ్చిమ బ్యాంక్ కెనాల్ కట్టకు కోత

- పల్లపు భూముల్లోకి చొచ్చుకొచ్చిన నీరు
- నీటిపారుదల శాఖాధికారుల అప్రమత్తతతో తప్పిన ముప్పు
- కోతకు గురైన ప్రాంతంలో మట్టితో తాత్కాలిక కట్ట



ఆలపాటి నగరం వద్ద పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కట్ట కోతకు గురై బయటకు ప్రవహిస్తున్న నీరు



కోత కారణంగా ఆలపాటి నగరం వైపు పల్లపు ప్రాంతంలోకి ప్రవహించిన నీరు

కొల్లూరు: కాలువ కట్టల బలహీనత మరోసారి బట్టబయలయింది. జిల్లాలోని 1.55 లక్షల ఆయకట్టుకు నీరందించాల్సిన పశ్చిమ బ్యాంక్ కెనాల్ కాలువ కట్ట కోతకు గురవడం ఖరీఫ్ రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తుంది. పశ్చిమ బ్యాంక్ కెనాల్ నీటి ప్రవాహ సామర్థ్యం 2001 క్యూసెక్కులు కాగా, గురువారం నీటిపారుదల శాఖాధికారులు 1903 క్యూసెక్కుల నీటిని కాలువ ద్వారా దిగువకు విడుదల చేశారు. అయితే కాలువ కట్టలు బలహీనంగా ఉండటంతో మండలంలోని దోనేపూడి శివారు ఆలపాటి నగరం వద్ద కరకట్టకు పడమర దిశగా ఉన్న కాలువ కట్ట కోతకు గురై నీరు గ్రామం వైపునకు చొచ్చుకొని వచ్చింది. గ్రామం సమీపంలో పశువులు దిగేందుకు, దుస్తులు శుభ్రం చేసుకునేందుకు అనువుగా ఏర్పాటు చేసిన ర్యాంపు ప్రాంతంలో కాలువ కట్ట ఎత్తు తగ్గి నీరు పొర్లి ప్రవహించింది. నీటి ప్రవాహ ఉధృతి అధికంగా ఉండటంతో కొద్ది సమయానికే కోత ఏర్పడి నీరు గ్రామం వైపు వస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ సిబ్బంది కోత పడిన ప్రాంతం నుంచి నీటి ప్రవాహాన్ని నిలువరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కాలువ కోత సమాచారం అందుకున్న సంబంధిత శాఖ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, డీఈ దీనదయాళ్, ఏఈ సాంబశివరావులు రాత్రి సమయంలో ఆప్రాంతానికి చేరుకొని పొక్లెయిన్ సాయంతో తాత్కాలిక మట్టి కట్టను ఏర్పాటు చేసి నీటి ప్రవాహం గ్రామం వైపునకు రాకుండా నిలువరించాడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. కాలువ కట్టకు ఏర్పడిన కోత విషయంపై స్పందించిన ఎస్ఈ ఉమామహేశ్వరరావు ఆప్రాంతంలో పశువులు కాలువలోకి దిగడం కారణంగా కాలువ కట్ట కుంగిపోయి నీరు పొర్లి పల్లపు ప్రాంతంలోకి వచ్చిందని, కాలువ కట్ట పటిష్టపరుస్తామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



దుర్గాప్రసాద్ మృతదేహం



వెంకటేశ్వరరావు మృతదేహం

తెనాలి రూరల్: అతి వేగం, రోడ్డుపై అవగాహన లేకపోవడంతో కారు అదుపుతప్పి గోడను ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తెనాలి శివారు పెదరావూరు వద్ద శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదకాకానికి చెందిన దుర్గాప్రసాద్(33) ఏడాది కిందట కారు కొని బాడుగులకు తిప్పుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక గుంటూరు నుంచి వెల్లటూరుకు బాడుగకు వచ్చాడు. ప్రయాణికులను దింపి తిరిగి వెళ్లే క్రమంలో వెల్లటూరుకు చెందిన గుంటూరు వెంకటేశ్వరరావు(50)ను ఎక్కించుకున్నాడు. వీరు ప్రయాణిస్తున్న కారు తెనాలి సమీపంలోని పెదరావూరు గ్రామ శివారుకు చేరుకోగానే అదుపు తప్పి, రోడ్డు వెంబడి ఉన్న గోడకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు 108, పోలీసులకు సమాచారమందించారు. కారులో ఇరుక్కున్న మృతదేహాల్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంకటేశ్వర్లుకి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. వెల్లటూరులో నివాసం ఉంటూ తెనాలిలో వాచ్‌మేన్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారం

కేసు నమోదుచేసిన పట్టణ పోలీసులు

బాపట్లటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన బాలికపై అదే ప్రాంతానికి చెందిన బాలుడు అత్యాచారం చేసిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. అత్యాచారం జరగడంతో బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేరాలలో భారీ చోరీ

13 సవర్ల బంగారం, రూ.20 వేల నగదు చోరీ



చీరాల: తాళం వేసిన ఇంటినే టార్గెట్ చేసి దుండగులు తాళం పగలకొట్టి బంగారం, నగదును దోచుకెళ్లారు. ఈఘటన శనివారం స్థానిక పేరాల గోలివారివీధిలో చోటుచేసుకుంది. ఇంటి యజమాని పొత్తూరి నాగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. పేరాల గోలి వారివీధిలో నివాసముంటున్న పొత్తూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి కొద్దిరోజులు క్రితం చిలకలూరిపేటలోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. రోజు మాదిరిగానే ఇంటి వరండాలో మొక్కలకు నీళ్లు పోసేందుకు వచ్చిన పనిమనిషి పార్వతి ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని చూసి ఇంటి యజమానికి సమాచారం ఇచ్చింది. హుటాహుటిన చీరాల వచ్చిన ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంటిలో ఉన్న 13 సవర్ల బంగారం, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడి వద్ద నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3500, గరిష్ట ధర రూ.5800, మోడల్ ధర రూ.4700 వరకు పలికింది.

నైపుణ్యాభివృద్ధితోనే భవిష్యత్తు



గ్రాడ్యుయేట్స్‌కు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ గంగాధరరావు

- ఏఎన్‌యూ వైస్ చాన్స్‌లర్ కె.గంగాధరరావు
- బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏఎన్‌యూ వీసీ

బాపట్ల: పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు పేర్కొన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో 11వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఏఎన్‌యూ వీసీ కె.గంగాధరరావు మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు మించి, నేటి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత అధునాతన ఇంజినీరింగ్ విభాగాలైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌లో ఉన్న పరిశోధన అవకాశాలను వివరించారు. బాపట్ల ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పల నేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ విభాగాలు ఇటీవల నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిడేషన్ ద్వారా అత్యున్నత ప్రమాణాలు గల విభాగాలుగా గుర్తింపు పొందాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఈసందర్భంగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి



పోలీసులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి, కక్షిదారులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు పనిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సబ్ కోర్టు ప్రాంగణంలో సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని కోరుతూ డివిజన్ పరిధిలోని పోలీసులతో శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి, కక్షిదారులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో న్యాయశాఖ లోక్ అదాలత్ నిర్వహిస్తోందన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం

జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సయ్యద్ అత్తర్ హుసేన్



మాట్లాడుతున్న బాపట్ల ఏడీఏ

యద్దనపూడి: ప్రకృతిలో లభించే వనరులను ఉపయోగించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వనరుల కేంద్రం బాపట్ల ఏడీఏ సయ్యద్ అత్తర్ హుసేన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పూనూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వ్యవసాయశాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల ఏడీఏ అత్తర్ హుసేన్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులు, జీవశిలీంధ్ర నాశినులు, వేపనూనెలాంటి ప్రకృతి వనరులను వినియోగించుకోవాలని సూచించారు. ఏరువాక కేంద్రం బాపట్ల శాస్త్రవేత్త జె.రాధాకృష్ణ మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో రైతులు విచక్షణ రహితంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తున్నారని, తద్వారా వాతావరణం, భూమి కలుషితమవడమే కాకుండా సాగుఖర్చులు పెరిగి రైతులకు నికర ఆదాయం తగ్గుతున్నట్లు తెలిపారు. దీని నివారణకు ప్రకృతి సిద్ధంగా లభించే ఘన, ద్రవ, బీజామృతం, నీమాస్త్రం, అగ్నిఅస్త్రం, వేపగింజల కషాయం వంటివి వినియోగించాలన్నారు. పర్చూరు ఏడీఏ మోహన్‌రావు మట్టినమునా తీసే విధానం, మట్టి పరీక్ష ఫలితాలను అనుసరించి సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువుల వినియోగం, జీవశిలీంద్ర నాశినులు, సమస్యాత్మక భూముల యాజమాన్యం పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించి సేంద్రియ పద్ధతుల ద్వారా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి చల్లగుండ్ల ఆదినారాయణ, వీఏఏలు హరీష్, ఏసుబాబు, లీలాసత్య, కృపావరం, ఎంటీ అప్పారావు, ఎల్‌టూలు వెంకటరత్నం, కోటిబాబు, ఐసీఆర్పీలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.